46

# దాహం తీరని పాత్ర

ఆ రోజుల్లో అవంతీ దేశం చాలా ప్రముఖ స్థానంలో వుండేది.

వివిధ దేశాల నుంచి వచ్చే బేహారులకు అది కూడలి స్థానంగా ఉండేది. అయితే... అది వైశాల్యంలోనూ చిన్నది.., జన సంఖ్యలోనూ చిన్నది.

ఆ కాలంలో మగధరాజ్యం భారతదేశం మొత్తంలో అతి బలవంతమైన దేశంగా అత్యంత ప్రముఖ స్థానంలో వుండేది. దాని వైశాల్యం, జనాభాకూడా అన్ని దేశాలకంటే ఎక్కువగా ఉండేది.

అవంతీ రాజ్యాన్ని అనంతవర్మ పరిపాలిస్తుండేవాడు.

అతనికి తన రాజ్యం ప్రముఖ స్థానంలో ఉన్నా- జన సంఖ్య, వైశాల్యంలో చిన్నదిగా ఉండడం బాధగా ఉండేది. తన రాజ్యం కూడా మగధ రాజ్యం వలే సువిశాలంగా వుండి, అత్యంత ప్రముఖ స్థానం పొందాలని అనంతవర్మ ఆకాంక్షిస్తూ ఉండేవాడు. అందుకోసం ఎంతగానో ప్రయత్నిస్తుండేవాడు. చుట్టు పక్కలనున్న కొన్ని చిన్న చిన్న పొరుగు రాజ్యాలని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

అయినా... అతని కలలు ఫలించలేదు. అవి తీరకుండానే అతనికి వృద్ధాప్యం వచ్చింది. శక్తి వుడిగి ఇంక పరిపాలన సాగించలేనన్న నమ్మకం కలిగింది. జ్యేష్ట కుమారుడు అనంగపాలునికి పట్టాభిషేకం చేసి రాజ్యపరిపాలన బాధ్యత అప్పగించాలని నిశ్చయించాడు.

ఆస్థాన పురోహితుని పిలిపించాడు. ఆయనతో తన మనసులోని మాట చెప్పి పట్టాభిషేకానికి అనువైన ముహూర్తం నిర్ణయించమని కోరాడు.

ఆ విధంగానే సుముహూర్తాన్ని స్థిరపరిచాడు ఆస్థాన పురోహితుడు. ఆ సుదినాన అనంగపాలుని పట్టాభిషేకం రంగరంగవైభవంగా జరిగింది.

కొంతకాలం తర్వాత అనంతవర్మకి అంత్యదినాలు సమీపించాయి.



తన కుమారుడు అనంగపాలుని దగ్గరకి పిలిచాడు. తన అవంతీ రాజ్యాన్ని మగధ దేశంవలె అత్యంత ప్రముఖ దేశంగా తీర్చిదిద్దాలన్న తన కోరిక కలగానే మిగిలిపోయిందని చెప్పి కళ్ళనీరు పెట్టుకున్నాడు. తాను సాధించలేని కార్యాన్ని తన కుమారుడు సాధించగలిగితే పరలోకంలో వుండే తన ఆత్మకి పరమశాంతి కలుగుతుందని చెప్పాడు. ఆ విధంగానే చేస్తానని మాట ఇమ్మని మరీ మరీ కోరాడు.

తండ్రిని ఆ స్థితిలో చూసేసరికి మనసు ద్రవించిపోయింది అనంగపాలునికి.

తాను అచిరకాలంలోనే ఆయన కోరికను విజయవంతంగా నెరవేర్చి తండ్రి రుణం తీర్చుకుంటానని వాగ్దానం చేశాడు.

ఆనందంగా కళ్ళు మూశాడు అనంతవర్మ.

అనంగపాలుడు వస్తుతః మంచివాడు. కాని , తండ్రి అవసాన సమయంలో కోరిన కోరికను తీర్చడం తన బాధ్యత అని భావించడంతో నిత్యమూ ఇతర రాజ్యాల మీద దండెత్తి వాటిని జయించడం, ఈ దేశాల సిరిసంపదలను కొల్లగొట్టి తెచ్చి తన ఖజానాను నింపడం పరిపాటి అయింది.

అయితే... తను చేస్తున్నది అకృత్యమనీ, మహాపాపమనీ అతనికి తెలుసు. ఈ విషయమై మనసు క్షోభిస్తుండేది. అందువల్ల ఆ పాప పరిహారార్థం 'చంద్రునికో నూలుపోగు' అన్నట్లు ఒక నియమం పెట్టుకున్నాడు.

ఉదయాన్నే రాజప్రసాద గవాక్షం దగ్గర నిలబడి రాజ వీధి వంక చూస్తుండేవాడు. తన కంటబడిన మొదటి బిక్షువును కోటలోకి పిలిపించేవాడు. అతనికి బిక్షాపాత్ర నిండేటట్లుగా బంగారు నాణాలతో నింపి దానం చేసేవాడు. ఈ విధంగా ఎంత కాలం దానం చేసినా తరగనటువంటి ధనం అతనికుంది.

ఒకరోజున సూర్యోదయాన అనంగపాలుడు యథాప్రకారం కిటికీ వద్ద నిలబడి రాజమార్గం వైపు చూస్తున్నాడు. కాషాయాంబరాలు ధరించి ఒకచేత ఢమరుకం, మరోచేతిలో ధగధగ మెరుస్తున్న చిన్న భిక్షా పాత్రతో వెళ్తున్న ఒక జంగమదేవర కనిపించాడు. అతని ముఖం దివ్య తేజస్సుతో వెలిగిపోతూ 'సాక్షాత్తూ కైలాసం నుంచి పరమ శివుడే దిగి వచ్చాడా..?' అని అనిపిస్తోంది.

ఆ సాధువును సగౌరవంగా లోనికి తీసుకు రమ్మనమని భటులు పంపించాడు.

భిక్షువును చూడగానే నమస్కరించి "స్వామీ... నేనిచ్చే సువర్ణముద్రలను గ్రహించి నన్ను అనుగ్రహించండి!" అన్నాడు అనంగపాలుడు వినయంగా.

"అలాగే నాయనా!" అని పాత్రతో వున్న చేతిని ముందుకి సాచాడు బికువు.

అనంగపాలుడు పళ్ళెరంలో వుంచిన బంగారు నాణాలను గుప్పిటతో తీసి ఆ పాత్రలో వేశాడు. ఆ పాత్ర చూడటానికి చిన్నదిగానే ఉంది. కాని, అది నిండలేదు.

వెంటనే మరికొన్ని నాణాలు అందులో వేశాడు. అయినా... అది నిండలేదు.

మళ్ళీమళ్ళీ ఎన్ని నాణాలు తెప్పించి పోసినా అది నిండలేదు.

చివరకి - ఖజానాలో వున్న అపార ధనరాసులన్నీ తెప్పించినా అది నిండనేలేదు. అది చూసి ఆశ్చర్యపడి, ఆ వచ్చినదెవరో మహాత్ముడనీ, తనని పరీక్షించడానికే వచ్చాడని గ్రహించాడు అనంగపాలుడు.

వెంటనే- "స్వామీ... తమరెవరో మహానుభావులు... ఏమిటీ విచిత్రం! భిక్షాపాత్ర అతి విచిత్రంగా ఉంది. ఇందులోని అంతరార్థమేమిటో వివరించి నన్ను అనుగ్రహించండి" అని వేడుకున్నాడు.

అందుకు ఆ సాధువు చిరునవ్వు నవ్వి, "మహారాజా... ఈ భిక్షా పాత్ర ఏ లోహంతోనూ చేయబడింది కాదు. ఇది మనిషి గుండెతో తయారయింది. దీనికి ఆకలి, పేరాశ, అసంతృప్తి ఎంత ఎక్కువంటే... ప్రపంచంలోని బంగారాన్నీ, సంపదలనీ అన్నిటినీ తెచ్చి ఇందులో పోసినా ఇది నిండదు. ఎప్పటికీ దీని దాహం తీరదు" అన్నాడు.

అనంగపాలునికి జ్ఞానోదయం అయింది. 'మనిషికి తృప్తి అనేది లేకుంటే ఎల్లప్పుడూ ఇతరుల సొత్తును అపహరించాలని చూస్తూనే ఉంటాడు. అన్నింటికంటే ముఖ్యం... ఆత్మసంతృప్తి' అని గ్రహించాడు.

వెంటనే పశ్చాత్తాపంతో ఆ సాధువు పాదాల మీద పడ్డాడు.

"ఇతరుల మనస్సులను ప్రేమతో జయించాలే కాని.., యుద్ధాల తోనూ, విధ్వంసంతోనూ కాదు. ఇకనుంచి ఈ అకృత్యాలు మానుకో!" అని హితబోధ చేసి అంతర్థానం అయ్యాడు.

అనంగపాలుడు తాను కొల్లగొట్టిన ధనాన్ని ఆయా రాజులకు తిరిగి ఇచ్చేసి వారిని స్వతంత్రులను చేశాడు. సాటి రాజులందరినీ సహోదరులుగానూ, ప్రజలనందర్నీ కన్నబిడ్డలలాగానూ చూసుకుంటూ ఆదర్శవంతంగా పరిపాలించాడు.

★★★

